# సింగిల్ పేజీ కథలు

## స్నేహం

కొండయ్య కోనయ్య బాల్య స్నేహితులు. ఇద్దరి వయసూ ఇంచుమించు ఒకటే. ఇళ్లు కూడా పక్క పక్కనే. చిన్నతనంలో ఆటపాటల్లో వున్న శ్రద్ధ చదువు మీద లేకపోయింది. అందువల్ల ఇద్దరికీ చదువు ఒంటబట్టలేదు. అయినా పెద్దలు సంపాదించి ఇచ్చిన పొలాలు వున్నాయి గనుక ఇబ్బంది లేకపోయింది. వ్యవసాయం చేసుకుంటూ సుఖంగా జీవిస్తున్నారు.

ప్రస్తుతం ఈ స్నేహితులు నడివయసుకు చేరుకున్నారు. పిల్లలు పెళ్లీడుకు వచ్చారు. కాలం గడుస్తున్నా లోకంలో ఎన్నిమార్పులు వస్తున్నా వీళ్ల స్నేహం మాత్రం నిరాటంకంగా సాగిపోతూనే వుంది. దిన దిన ప్రవర్ధమానం అవుతూనే వుంది. ఇద్దరిదీ ఒకటే మాట. ఇద్దరిదీ ఒకటే బాట. కొండయ్య ఔనంటే కోనయ్య కూడా ఔనంటాడు. కోనయ్య కాదంటే కొండయ్య కూడా కాదంటాడు. వాళ్లిద్దరి స్నేహం అంత గాఢమైనది. ఊరందరికీ వీళ్ల స్నేహం గురించి తెలుసు. చుట్టుప్రక్కల గ్రామాలలో కూడా వీళ్ల స్నేహం గురించి చిత్రంగా చెప్పుకుంటుంటారు.

లింగయ్య అనే అతను ఈమధ్యే వేరే గ్రామం నుంచి వచ్చి ఈ ఊళ్లో కాపురం పెట్టాడు. కొండయ్య కోనయ్యల స్నేహం గురించి అతను విన్నాడు. మొదట్లో అంతగా పట్టించుకోలేదు. పదే పదే ఆ విషయం వినిపించే సరికి ఆశ్చర్యం కలిగింది. రాను రాను ఆ సంగతి వినటం అతనికి చిరాకనిపించింది. ఇవ్వాళ ప్రాణ మిత్రులుగా వున్న వారు రేపు బద్ధ శత్రువులుగా మారిన సందర్భాలు అనేకం వున్నాయి. ఏదో ఒకనాడు వీళ్ల పరిస్థితీ అంతే అనుకున్నాడు. ఆ సుముహూర్తం త్వరగా వస్తే బాగుండునని కోరుకున్నాడు. అవసరమైతే అందుకు తాను కూడా కృషి చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. రోజులు గడుస్తున్నాయి.



కోనయ్య కూతురికి పొరుగూరి నుంచి పెళ్లి సంబంధం వచ్చింది. పెళ్లి చూపులయ్యాయి. సంబంధం ఖాయపర్చుకున్నారు. త్వరలోనే ముహూర్తాలు పెట్టుకోవాలనుకున్నారు

అవకాశం కోసం ఎదురు చూస్తోన్న లింగయ్య వెంటనే తన 'కుతంత్రం' అమలు జరిపాడు. వారం రోజుల తర్వాత తిన్నగా కోనయ్య ఇంటికి వెళ్లి ''మీ అమ్మాయి పెళ్లి సంబంధం చెడిపోయిందంట కదా!'' అని అడిగాడు. ఆశ్చర్యంగా తనవంక చూస్తోన్న కోనయ్యతో మళ్లీ తనే అన్నాడు- ''చెడగొట్టింది ఎవరో తెలుసా? నీ ప్రాణ స్నేహితుడని చెప్పుకుంటున్న కొండయ్యే!''

మాట పూర్తయ్యేసరికే లింగయ్య చెంప ఛెళ్లుమంది. కళ్లు బైర్లు కమ్మాయి. భూమి గిరగిర తిరిగినట్లైంది. కొంచెం సేపటికి తేరుకొని ''తెలిసిన విషయం చెబితే కొట్టటమేంటి?'' అని అడిగాడు లింగయ్య.

''కొట్టటం కాదు. నిన్ను నిలువనా నరకాల్సిందే. నీ పని చెబుతా రా'' అని అతని చెయ్యి పట్టుకొని, పక్కనే వున్న కొండయ్య ఇంటికి లాక్కుపోయాడు కోనయ్య.

అంతకుముందు రోజే కొండయ్య ఏదో పనిమీద పొరుగూరు వెళ్లాడు. కోనయ్యకు కాబోయే వియ్యంకుడు కనిపించి ఒక విషయం చెప్పాడు. ''కొండయ్యగారూ! కోనయ్యగారి అమ్మాయి ప్రవర్తన మంచిది కాదనీ, ఆ సంబంధం మానుకొమ్మనీ మీ పేరుతో వచ్చిన ఉత్తరం అందింది!''

ఆ మాట విని కొండయ్య ఆశ్చర్యపోయాడు. వెంటనే తేరుకొని అన్నాడు ''మా కోనయ్య కూతురు గురించి నేనలా ఎందుకు రాస్తానండి? పైగా నాకు ఉత్తరం రాసేపాటి చదువెక్కడిది? ఇలాంటి ఉత్తరాలు ఇతరులతో రాయిస్తే రహస్యం బైట పడిపోకుండా వుంటుందా?''

''నాకు తెలుసండి. మీ స్నేహం గురించి తెలిసిన వాడెవ్వడూ ఈ పని మీరు చేశారంటే నమ్మడు. మీరంటే గిట్టని ఎవడో ఆకాశరామన్న మీ పేరుతో ఈ ఉత్తరం రాశాడు. జాగ్రత్తపడలానని చెప్పాను గాని, దీనివల్ల మన కొచ్చిన నష్టమేమీ లేదు. రెండు మూడు రోజులలో ముహూర్తాలు పెట్టించుకుందామని కోనయ్య బావగారితో చెప్పండి!'' అన్నాడు.

జరిగింది ఇది. ఈ పని చేసింది ఎవరా అని స్నేహితులిద్దరూ తర్జన భర్జన పడ్డారు. రాసిన వాడికీ తమకూ తప్ప మరొకరికి తెలిసే అవకాశం లేదు. రాసిన వాడిని కనిపెట్టటం ఎలాగో వాళ్లకి అర్థం కాలేదు. ఈలోగా, తన పాచిక పారి వుంటుందన్న ఆనందంతో తొందరపడి లింగయ్య విషయం కదిపేసరికి, ఆకాశరామన్న ఇతనేనని తేలిపోయింది.

విషయం వివరించి ''పీక్ నలుగుపెట్టి వదిలేద్దామా? లేక ఊళ్లో పంచాయితీ పెట్టిద్దామా?'' అని అడిగాడు కోనయ్య.

కొండయ్య పేరుకు తగ్గట్టు పర్వతంలా వుంటాడు. పరిస్థితి విషమించక ముందే గబుక్కున కొండయ్య కాళ్లమీద పడిపోయాడు లింగయ్య.

''కొండయ్యగారూ! నేను చేసింది తప్పే. ఒప్పుకుంటున్నాను. అయితే నా ఉద్దేశ్యం కోనయ్యగారి అమ్మాయి పెళ్లి చెడగొట్టాలని కాదు. అందరూ మీ స్నేహం గురించి గొప్పగా చెప్తూవుంటే, కాదని నిరూపించాలని ఈ తప్పుడు పని చేశాను. మీది నిజంగా గొప్ప స్నేహమే! మీరిద్దరూ కృష్ణార్జునుల లాంటి వారు. మిమ్మల్నెవరూ విడదియ్యలేరు. నాకు బుద్ధొచ్చింది. ఇది మొదటి తప్పుగా భావించి నన్ను క్షమించండి!'' అని ప్రాధేయపడ్డాడు లింగయ్య.

స్నేహితులిద్దరూ చూపులతోనే మాట్లాడుకున్నారు. ఒకేసారి ''సరే పో!'' అనేశారు.

బ్రతుకు జీవుడా అనుకొని బయటికి పరుగెత్తాడు లింగయ్య.

-హెచ్.ఆర్.చంద్రం (గుడివాడ)